



# అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 312 | వరంగల్ | శుక్రవారం, 18 సెప్టెంబర్ 2026 | పేజీలు: 07


రాష్ట్ర, అంతర్రాష్ట్ర స్థాయిలో పేరున్న మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని కురవి శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయానికి నిధులు మంజూరవుతున్నా అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వేలాది మంది, ప్రత్యేక సందర్భాల్లో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే పుణ్యక్షేత్రంలో కనీస మౌలిక వసతుల కొరత భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.కోటి, తెలంగాణలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హయాంలో రూ.5 కోట్లు.. మొత్తం రూ.6 కోట్ల మేర ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ నిధుల్లో ఎంత విడుదలైంది? ఏ పనులకు ఎంత ఖర్చు చేశారు? ఇంకా ఎంత మొత్తం మిగిలి ఉంది? అనే వివరాలు భక్తులకు అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంజూరు, విడుదల, ఖర్చులపై పూర్తి వివరాలను ఆలయ అధికారులు వెల్లడించాలని భక్తులు కోరుతున్నారు. - అక్షరశక్తి, మహబూబాబాద్

# కోట్ల నిధులు.. కుంటుపడిన అభివృద్ధి!

రూ.6 కోట్ల మంజూరుకు లెక్కలేవీ?

రూ.5 కోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు దుస్థితి

భక్తులకు వసతి, తాగునీరు, మరుగుదొడ్లు కరువు

ఆలయ ఆదాయ–వ్యయాలపై పారదర్శకత ఏది?

మాస్టర్‌ప్లాన్‌తో అభివృద్ధి చేయాలని భక్తుల డిమాండ్


3


# ఇదేం దోపిడీ?




- ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల మాయాజాలం
- కార్మిక చట్టాలు.. కనీస ప్రమాణాలకు తూట్లు
- "సర్వీస్ ఛార్జీల" నెపంతో వేతనాల్లో భారీగా కోత
- పీఎఫ్, ఈఎస్ఐ నిధులూ స్వాహా..
- వీక్లీ ఆఫ్, పండుగ సెలవులు బంద్
- తీవ్ర మనోవేదనలో కార్మికులు
- పట్టించుకోని అధికారులు.. కార్మిక సంఘాలు


4


వరంగల్ నగరంలో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల అక్రమాలు మితిమీరుతున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కార్మిక చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీని నడపాలంటే పీఎస్ఏఆర్ఏ (ప్రైవేట్ సెక్యురిటీ ఏజెన్సీస్ రెగ్యులేషన్ యాక్ట్ ) లైసెన్స్ తప్పనిసరి. అయినప్పటికీ, ట్రైసిటీలో పదుల సంఖ్యలో ఏజెన్సీలు ఎటువంటి లైసెన్సులు లేకుండా అక్రమంగా కొనసాగుతున్నాయి.

- అక్షరశక్తి, వరంగల్

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హుడిగా ప్రకటించింది. 2024లో దానం కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేశారు. కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయడాన్ని పరిగణలోకి తీసుకుని, హైకోర్టు స్పీకర్ తీర్పును కొట్టివేసింది. కాగా, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. - అక్షరశక్తి, హైదరాబాద్

# ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు

- పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు తీర్పు
- స్పీకర్ నిర్ణయంపై న్యాయస్థానం జోక్యం
- ఖాళీ కానున్న ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం




5



## రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక

**అక్షరశక్తి, వరంగల్:** రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వరంగల్ జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొండపర్తి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీగా నల్లబెల్లి అనిల్, ఉపాధ్యక్షుడిగా మోటే మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దాంతోజు కుమారస్వామి, ట్రెజరర్లుగా గంట రజిని, రామ రామును ఎన్నుకున్నారు. సోషల్ మీడియా బాధ్యతలను నూనె ఆనంద్, పాలకుర్తి అనిల్, తేజ, సాంబరి రాజేష్‌కు అప్పగించారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వినీత, కోమల, బేబీ రాణి, కరుణాకర్, స్వాతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొండపర్తి శ్రీకాంత్ మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంక్షేమం, హక్కులు, అభివృద్ధి కోసం కమిటీ సభ్యులంతా ఐక్యంగా, సమష్టిగా పనిచేసి మరిన్ని విజయాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జనరల్ సెక్రటరీ నల్లబెల్లి అనిల్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆరోగ్య మిత్రుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. మరోసారి జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్న ఆరోగ్య మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యక్షుడు మోటే మహేష్ తనను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆరోగ్య మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌తో కాలనీవాసులకు ఇబ్బందులు



**అక్షరశక్తి, హనుమకొండ:** అలంకార్ జంక్షన్ సమీపంలోని కాకతీయ కాలనీ ఫేజ్ 2లో రోడ్డుపైనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగో నంబర్ రోడ్డు మూల మలుపులో సగభాగం రోడ్డును ఆక్రమించేలా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించాలని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులను కోరినప్పటికీ స్పందన లేదని కాలనీవాసులు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలంటే అయ్యే ఖర్చును కూడా తామే భరించాలని అధికారులు చెబుతున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా మూల మలుపులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో వాహనాలు సక్రమంగా తిరగలేకపోతున్నాయని, పాఠశాల బస్సుల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించాలని కాకతీయ కాలనీ మాజీ అధ్యక్షుడు రంగారావు కోరారు.

## కుట్టుమిషన్ శిక్షణ ధ్రువపత్రాల అందజేత

**అక్షరశక్తి, హనుమకొండ:** షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత, కార్మిక రత్న డా. యమడాల హనుకాంత్ ఆధ్వర్యంలో ఎఫ్ఎఫ్ఎం సంస్థ సహకారంతో కొండపర్తి గ్రామంలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు నెలలపాటు కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 35 మంది మహిళలకు ఎఫ్ఎఫ్ఎం సంస్థ ఆధ్వర్యంలో ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం మరో 35 మంది పేద మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ అందించేందుకు నూతన శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కట్కూరి స్వాతి, కట్ట సంబరాజు, మాజీ సర్పంచ్ కట్కూరి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎన్ఐటీ వరంగల్ స్నాతకోత్సవం

- రెండు రోజుల్లో 1,997 మందికి డిగ్రీలు
- 19న యూజీ.. 20న పీజీ, పీహెచ్‌డీ పట్టాలు
- ముఖ్య అతిథిగా టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ఎండీ సంతోష్‌కుమార్
- ఇద్దరు ప్రముఖులకు గౌరవ డిగ్రీలు.. విద్యార్థులకు స్వర్ణ పతకాలు



**అక్షరశక్తి, కాజీపేట :** ఎన్ఐటీ వరంగల్ 24వ స్నాతకోత్సవం శని, ఆదివారాల్లో ఘనంగా జరగనుంది. సంస్థలోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ, ఎగ్జిట్ డిగ్రీలు కలిపి మొత్తం 1,997 మందికి పట్టాలు అందజేయనున్నారు. రెండు రోజుల కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయి. సెప్టెంబరు 19న అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 20న పోస్ట్‌గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. మొత్తం పట్టాల్లో 930 అండర్‌గ్రాడ్యుయేట్, 945 పోస్ట్‌గ్రాడ్యుయేట్, 100 పీహెచ్‌డీ, 22 ఎగ్జిట్ డిగ్రీలు ఉన్నాయి.

**ముఖ్య అతిథిగా సంతోష్‌కుమార్**

టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌కుమార్ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెమీకండక్టర్ పరిశ్రమ, సాంకేతిక ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగంలో అవకాశాలపై ఆయన ప్రసంగించనున్నారు. ఎన్ఐటీ వరంగల్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ డా. బి.వి.ఆర్. మోహన్‌రెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. ఆయన సైయంట్ వ్యవస్థాపక చైర్మన్, బోర్డ్ సభ్యుడిగా సేవలందిస్తున్నారు.

**ఇద్దరికి గౌరవ డిగ్రీలు**

సాంకేతిక, ఇంజినీరింగ్ రంగాల్లో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఇద్దరు ప్రముఖులకు గౌరవ డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. విమానయాన, అంతరిక్ష ఇంజినీరింగ్‌లో ఆటోమేటిక్ కంట్రోల్ టెక్నాలజీల వినూత్న వినియోగంపై చేసిన కృషికి డా. పద్మనాభన్ కె. మీనన్‌కు డాక్టర్ ఆఫ్ సైన్స్ (డీఎస్సీ) డిగ్రీ అందజేస్తారు. భారత సెమీకండక్టర్ రంగ అభివృద్ధికి సాంకేతిక నాయకత్వం అందించినందుకు శ్రీ ఆనంద్ రామమూర్తికి గౌరవ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీ ప్రదానం చేయనున్నారు.

**విద్యార్థులకు స్వర్ణ పతకాలు**

అత్యుత్తమ విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వర్ణ పతకాలు, ప్రాజెక్టులు, డిసర్టేషన్లు, పరిశోధనల్లో ప్రతిభ చూపిన వారికి అవార్డులు అందజేయనున్నారు. బీటెక్‌లో అన్ని ప్రోగ్రామ్‌లలో అత్యుత్తమ ప్రతిభకు సిద్ధి బార్పుటేకు డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ లభించనుంది. యూజీలో తరగతుల వారీగా ప్రథమ స్థానాలు సాధించిన ప్రియాన్షు కుమార్ సింగ్, నలజాల జోషిత్, వలుసా రఘువరన్, దొండపాటి లోకేశ్వర్, మదగాని సాత్విక్, సిద్ధి బార్పుటే, జయంతి అను, అమన్ అబ్దుల్స మద్ ఇనామ్‌దార్‌లకు రోల్ ఆఫ్ ఆనర్ గోల్డ్ మెడల్స్ అందజేయనున్నారు. పీజీలో అన్ని ఎం.టెక్ ప్రోగ్రామ్‌లలో ప్రథమ స్థానానికి అడెపు అంజలి, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ ప్రోగ్రామ్‌లలో ప్రథమ స్థానానికి జాలుమెడి భరణికి డైరెక్టర్స్ గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయనున్నారు. ఉత్తమ బీటెక్ ప్రాజెక్ట్‌కు బుద్ధ జెశ్వంతి, ఉత్తమ ఎం.టెక్ డిసర్టేషన్‌కు అట్కరే సార్థక్ వినోద్, ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్‌కు డా. అపూర్వ బోరా అవార్డులు అందుకోనున్నారు. పట్టభద్రులు, అవార్డు గ్రహీతలకు ఎన్ఐటీ వరంగల్ అభినందనలు తెలిపింది.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**అక్షరశక్తి, వరంగల్, సెప్టెంబర్ 18 :** వరంగల్ మహానగరంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శుక్రవారం సంబధిత అధికారులతో సందర్శించి పనులను పరిశీలించారు. పరిశీలన అనంతరం పనుల పురోగతి పై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష లో ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, పారిశుధ్యం తదితర పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అందుకు ఆసుపత్రి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంజీఎం పర్యవేక్షకులు రాంకుమార్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జీడబ్ల్యూఎంసీ రాజకుమార్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆనందం, ఆర్ అండ్ బీ ఈఈ రాజేందర్, ఆర్డీఓ సుమ, ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సర్వాణన్, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.






## లెక్కలపై అవగాహన పెంపొందించుకోవాలి

**అక్షరశక్తి, హనుమకొండ:** కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో లెక్కల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెండు రోజుల లెక్కల అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులో ఉన్నప్పటికీ స్వయంగా లెక్కలు చేయడం ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి, తార్కిక ఆలోచనా సామర్థ్యం పెరుగుతాయని అన్నారు. లెక్కలను కేవలం పాఠ్యాంశంగా కాకుండా నిత్యజీవితం, విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఉపయోగపడే నైపుణ్యంగా భావించాలని సూచించారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డి. సుకుమార్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పద్ధతులతో లెక్కలను సులభంగా నిర్వహించవచ్చని, విద్యార్థుల్లో లెక్కలపై ఉన్న భయాన్ని తొలగించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కేయూ ఓఎస్డీ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ సౌజన్య, సదస్సు కన్వీనర్ డాక్టర్ నాగయ్య తదితరులు లెక్కల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహ్మాన్, అధ్యాపకులు, లెక్కల విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కోట్ల నిధులు.. కుంటుపడిన అభివృద్ధి!

- రూ.6 కోట్ల మంజూరుకు లెక్కలేవీ?
- రూ.5 కోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌కు దుస్థితి
- భక్తులకు వసతి, తాగునీరు, మరుగుదొడ్లు కరువు
- ఆలయ ఆదాయ–వ్యయాలపై పారదర్శకత ఏది?
- మాస్టర్‌ప్లాన్‌తో అభివృద్ధి చేయాలని భక్తుల డిమాండ్



**అక్షరశక్తి, మహబూబాబాద్ :** రాష్ట్ర, అంతర్రాష్ట్ర స్థాయిలో పేరున్న మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని కురవి శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి ఆలయానికి నిధులు మంజూరవుతున్నా అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం వేలాది మంది, ప్రత్యేక సందర్భాల్లో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే పుణ్యక్షేత్రంలో కనీస మౌలిక వసతుల కొరత భక్తులను ఇబ్బందులకు గురిచేస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.కోటి, తెలంగాణలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హయాంలో రూ.5 కోట్లు.. మొత్తం రూ.6 కోట్ల మేర ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ నిధుల్లో ఎంత విడుదలైంది? ఏ పనులకు ఎంత ఖర్చు చేశారు? ఇంకా ఎంత మొత్తం మిగిలి ఉంది? అనే వివరాలు భక్తులకు అందుబాటులో లేకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంజూరు, విడుదల, ఖర్చులపై పూర్తి వివరాలను ఆలయ అధికారులు వెల్లడించాలని భక్తులు కోరుతున్నారు.

**కోట్లతో కట్టిన కాంప్లెక్స్..**

రూ.5 కోట్లతో నిర్మించినట్లు చెబుతున్న షాపింగ్ కాంప్లెక్స్ పరిస్థితిపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మాణం పూర్తయి కొద్దికాలం గడవకముందే భవనాలు దెబ్బతినడం, వర్షాలకు నీరు కారుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కోట్ల రూపాయలతో చేపట్టిన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించారా? పనులను ఎవరు పర్యవేక్షించారు? నాణ్యతపై సాంకేతిక పరీక్షలు నిర్వహించారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**భక్తులకు కనీస వసతులేవీ?**

ఆలయానికి గణనీయమైన ఆదాయం వస్తున్నప్పటికీ భక్తులకు సరిపడా వసతి గృహాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి సౌకర్యాలు లేకపోవడం ఇబ్బందికరంగా మారిందని భక్తులు చెబుతున్నారు. ప్రత్యేక ఉత్సవాలు, జాతరలు, పర్వదినాల్లో రద్దీ మరింత పెరుగుతున్నా అందుకు అనుగుణంగా సౌకర్యాలు పెరగడం లేదని అంటున్నారు. ఆలయ వార్షిక ఆదాయం, వ్యయం, అభివృద్ధి పనుల వివరాలను బహిరంగపరచాలని కోరుతున్నారు.

**ప్రభుత్వ భూముల పరిరక్షణ ఎక్కడ?**

ఆలయం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ, ఆలయ భూముల పరిరక్షణపై కూడా అనేక ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆలయ భూములు, భక్తులు నిర్మించిన గదులు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించాలని భక్తులు కోరుతున్నారు. ఆలయానికి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములను కాపాడటంలో అధికారులు విఫలమైతే భవిష్యత్తులో ఆలయ విస్తరణకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

**అద్దాల మేడ.. దద్దనం విశ్రాంతి భవనం**

గతంలో ఉన్న అద్దాల మేడను పునర్నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. దద్దనం ప్రాంతంలో భక్తుల కోసం ప్రత్యేక విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న విశ్రాంతి భవనంలోనూ అవసరమైన సదుపాయాలు లేవని చెబుతున్నారు.

**సెంటర్ లైటింగ్.. పార్కింగ్ ఏదీ?**

ఆలయ పరిసరాల్లో సెంటర్ లైటింగ్, రహదారులు, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రత్యేక పార్కింగ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ, ఆలయ పరిధిలో అందుబాటులో ఉన్న నిధులను సమన్వయం చేసి సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచిస్తున్నారు.

**పెద్ద చెరువు.. పర్యాటక కేంద్రంగా మార్చాలి**

కురవి పెద్ద చెరువును సుందరీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ఆలయానికి వచ్చే భక్తులకు అదనపు ఆకర్షణగా మారుతుందని స్థానికులు అంటున్నారు. వాకింగ్ ట్రాక్, సుందరీకరణ, ఇతర పర్యాటక సౌకర్యాలతో చెరువును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

**హరిత హోటల్ ఏమైంది?**

గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్ మంజూరు చేసినట్లు పేర్కొంటున్న హరిత హోటల్ నిర్మాణం ముందుకు సాగకపోవడంపైనా ప్రశ్నలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నప్పటికీ పనులు ఎందుకు నిలిచిపోయాయో అధికారులు స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**మాస్టర్‌ప్లాన్ ఏదీ?**

ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందని భక్తులు చెబుతున్నారు. మంజూరైన నిధులు, ఖర్చుల వివరాలు, పెండింగ్ పనులు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

## సెప్టెంబర్ 17 స్ఫూర్తితో పాలనలో బీసీలకు సముచిత స్థానం దక్కాలి



**అక్షరశక్తి, హనుమకొండ:** తెలంగాణ పాలనలో బీసీలకు జనాభా ప్రాతిపదికన సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ హనుమకొండ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. చారిత్రాత్మక సెప్టెంబర్ 17 సందర్భంగా తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక సాధికారతపై ఫోరమ్ నాయకులు మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజన వర్గాలకు చెందిన పలువురు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఫోరమ్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కే. వీరస్వామి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణకు స్వేచ్ఛ వచ్చిన రోజుతో పాటు సామాజిక న్యాయానికి పునాది వేసిన రోజని అన్నారు. స్వరాష్ట్రంలో జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు నిర్ణయాధికారంలో, ప్రభుత్వ కీలక పదవుల్లో ఆశించిన స్థాయిలో భాగస్వామ్యం లభించడం లేదని పేర్కొన్నారు. "ఎవరి జనాభా ఎంత ఉంటే.. వారి వాటా అంత ఉండాలి" అనే సూత్రం క్షేత్రస్థాయిలో అమలు కావాలని అన్నారు. కుల గణన నివేదికలో పారదర్శకత పాటించాలని, తెలంగాణలో కీలక పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా రిజర్వేషన్లు అమలు చేయాలని ఫోరమ్ డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనలో ఓబీసీ కులాల వివరాల నమోదుకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేసింది. అమరవీరుల ఆశయాల మేరకు ప్రతి వర్గానికీ నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని, బీసీ హక్కుల సాధన కోసం మేధావులు, ఉద్యోగులు, యువత ఐక్యంగా ముందుకు సాగాలని ఫోరమ్ పిలుపునిచ్చింది.

## ఉర్సు చెరువును ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలి



**అక్షరశక్తి, వరంగల్:** చారిత్రాత్మక వరంగల్ మహానగరంలోని ఉర్సు చెరువు ముందు ప్రాంతాన్ని ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదను కలిసి వినతిపత్రం సమర్పించారు. చెరువు ప్రాంతంలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసి భావితరాలకు వారి స్ఫూర్తిని అందించాలని కోరారు. తమ ఆరాధ్య దైవం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, తెలంగాణ సిద్ధాంతకర్త దివంగత డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహాలను కూడా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులు పెందోట సురేష్ కుమార్, వీణవంక సదానందం, కార్యదర్శులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, సిద్ధోజు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## యూపీఐ చార్జీల నుంచి ఎరువులకు మినహాయింపు ఇవ్వాలి

- రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు

**అక్షరశక్తి, హనుమకొండ:** రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాలపై ఆధారపడి వ్యాపారం నిర్వహిస్తున్న డీలర్లకు యూపీఐ లావాదేవీలకు సంబంధించిన చార్జీల నుంచి మినహాయింపు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్, డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపుల వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలోనూ రైతులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాల్లో డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో డీలర్లపై అదనపు లావాదేవీ వ్యయాలు పడకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్‌స్‌ను సకాలంలో అందించడంలో డీలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన వ్యాపార లావాదేవీలను ప్రోత్సహించే విధంగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాలకు సంబంధించిన యూపీఐ చెల్లింపులపై డీలర్లకు ప్రత్యేక మినహాయింపు లేదా రాయితీ విధానం అమలు చేయాలని కోరారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలతో సమన్వయం చేసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని నాగుర్ల వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను అందించడంతో పాటు డీలర్లపై అనవసరమైన అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని ఆయన కోరారు.



## పర్యాటక రంగంలో ఏఐ, సాంకేతికత ఎంతో ఉపయోగకరం





**అక్షరశక్తి,హనుమకొండ:** భవిష్యత్తులో పర్యాటక రంగాన్ని మరింత సులభతరం, వేగవంతం, వ్యక్తిగతీకరించడంలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏఐ) కీలకపాత్ర పోషిస్తాయని డాక్టర్ డి. సురేష్ బాబు తెలిపారు. ప్రభుత్వ పింగిలి మహిళా కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఆయన ఏఐ, సాంకేతికతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఐ ఆధారిత పర్యాటక మార్గదర్శకులు పర్యాటకులకు ప్రదేశాల సమాచారం, మార్గదర్శకత్వం, ప్రయాణ సూచనలు అందించగలరని వివరించారు. ఏఐ కెమెరా ద్వారా ఫొటోలను విశ్లేషించి చారిత్రక, పర్యాటక ప్రదేశాలపై సమాచారం పొందవచ్చని, వివిధ భాషల వారికి గూగుల్ అనువాదం వంటి సాంకేతిక సాధనాలు ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఏఐ ట్రిప్ ప్లానర్, క్యూఆర్ కోడ్లు, జీపీఎస్ తదితర సాంకేతికతలను పర్యాటక మార్గదర్శకులు ఎలా ఉపయోగించుకోవాలో డాక్టర్ సురేష్ బాబు సవివరంగా వివరించారు. చారిత్రక అంశాలపై సందర్శకులకు ఆసక్తికరమైన సమాచారాన్ని అందించడంలో ఏఐ దోహదపడుతుందని పేర్కొన్నారు. అయితే ఏఐను అవసరమైన మేరకే వినియోగించాలని, అతిగా ఆధారపడటం వల్ల నష్టాలు కలిగే అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని అధ్యక్షత వహించగా, సర్టిఫికెట్ కోర్సు కన్వీనర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ పి. నరేష్, డాక్టర్ బి. జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరువు సహాయక చర్యలు చేపట్టాలి

**అక్షరశక్తి, వరంగల్, సెప్టెంబరు 18:** జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నందున వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వో విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని 13 మండలాల్లో గత జూన్ నుంచి సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోందని బాలరాజు తెలిపారు. దీంతో చెరువులు, కుంటలు, బావులు ఎండిపోతున్నాయని, పంటలు దెబ్బతిని రైతులు, కౌలు రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఒక్క ఎకరాకు ఇప్పటివరకు రూ.20 వేలకుపైగా ఖర్చు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వ్యవసాయ కూలీలకు పనులు లేక పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలింపజేసి సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. పంట నష్టం ఆధారంగా రైతులు, కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామన్న హామీని అమలు చేసి గత మూడేళ్ల బకాయిలను చెల్లించాలని కోరారు.



# ఇదేం దోపిడీ ?

- ప్రైవేట్ సెక్యురిటీ ఏజెన్సీల మాయాజాలం
- కార్మిక చట్టాలు.. కనీస ప్రమాణాలకు తూట్లు
- "సర్వీస్ ఛార్జీల" నెపంతో వేతనాల్లో భారీగా కోత
- పీఎఫ్, ఈఎస్ఐ నిధులూ స్వాహా..
- వీక్లీ ఆఫ్, పండుగ సెలవులు బంద్
- తీవ్ర మనోవేదనలో కార్మికులు
- పట్టించుకోని అధికారులు.. కార్మిక సంఘాలు




**అక్షరశక్తి, వరంగల్:** వరంగల్ నగరంలో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల అక్రమాలు మితిమీరుతున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కార్మిక చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీని నడపాలంటే పీఎస్ఏఆర్ఏ (ప్రైవేట్ సెక్యురిటీ ఏజెన్సీస్ రెగ్యులేషన్ యాక్ట్) లైసెన్స్ తప్పనిసరి. అయినప్పటికీ, ట్రైసిటీలో పదుల సంఖ్యలో ఏజెన్సీలు ఎటువంటి లైసెన్సులు లేకుండా అక్రమంగా కొనసాగుతున్నాయి. మరి కొన్ని ఏజెన్సీలు సెక్యూరిటీ గార్డుల వేతనాల నుంచి ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) కోసం నగదు కట్ చేసినప్పటికీ, ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేయకుండా నిధులను స్వాహా చేస్తున్నాయి. క్లయింట్లు (కంపెనీలు/మార్కెట్లు) ఒక్కో గార్డుకు ఇచ్చే పూర్తి వేతనాన్ని అందించకుండా, "సర్వీస్ ఛార్జీల" నెపంతో 15% నుండి 20% వరకు కమీషన్లను అక్రమంగా దండుకుంటున్నాయి. చట్టప్రకారం 8 గంటలు పని చేయించాల్సి ఉండగా, గార్డులతో ఎలాంటి అదనపు వేతనం ఇవ్వకుండా 12 నుండి 16 గంటల వరకు బలవంతంగా పనిచేయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీక్లీ ఆఫ్ (వారానికి ఒక సెలవు), పండుగ సెలవులు లేదా అనారోగ్య సెలవులు ఇవ్వకుండా కార్మికులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**ఫిర్యాదు చేస్తే వేధింపులు**

ఒక సంస్థ వద్ద 100 మంది భద్రతా సిబ్బంది పనిచేస్తున్నారని చెబితే... వాస్తవంగా అంత మందే పని చేస్తున్నారా? ఆ వంద మందికీ హాజరు ఉందా? వేతన చెల్లింపు ఆధారం ఉందా? వేతన పట్టికలో ఉన్నవారే వాస్తవంగా విధుల్లో ఉన్నారా? వర్తించే సందర్భాల్లో పీఎఫ్, ఈఎస్ఐ నమోదులు ఎవరెవరికి ఉన్నాయి? బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారా? అసలు వేతనం ఎంత? వారికి ఇస్తున్నదెంత ? కనీస వేతన నిబంధనలు వర్తిస్తే అవి పాటిస్తున్నారా? ఓవర్‌టైమ్ లేదా అదనపు పని ఉంటే దానికి వర్తించే చట్టపరమైన నిబంధనలు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలకు ఏజెన్సీల నిర్వాహకుల నుంచి మౌనమే సమాధానంగా మారుతుండటం గమనార్హం. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే... అధికారులకు ఫిర్యాదు చేస్తే వారిని వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రైవేట్ దవాఖానలు ఎందుకు ప్రోత్సహిస్తున్నట్లు..?**

వరంగల్ నగరంలోని ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలను ప్రోత్సహించడం అనుమానాలకు తావిస్తోంది. ప్రైవేట్ హాస్పిటల్ అంటే కేవలం వైద్యం అందించే ప్రదేశం మాత్రమే కాదు. అక్కడ పనిచేసే ప్రతి ఉద్యోగి ఆసుపత్రి సేవల్లో భాగమే. డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లతో పాటు సెక్యూరిటీ గార్డులు, హౌస్‌కీపింగ్ సిబ్బంది, శానిటేషన్ వర్కర్లు, ఇతర సహాయక సిబ్బంది కూడా ఆసుపత్రి రోజువారీ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తారు. అయితే హాస్పిటళ్లు సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ సిబ్బందిని నేరుగా తమ సంస్థ ఉద్యోగులుగా ఎందుకు నియమించుకోవడం లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. చాలా ప్రైవేట్ సంస్థలు సెక్యూరిటీ, హౌస్‌కీపింగ్ వంటి సేవలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తుండటం అంతుచిక్కడంలేదు. దీనివల్ల ఆసుపత్రికి పాలనా బాధ్యతలు తగ్గడం, సిబ్బంది నిర్వహణ సులభం కావడం, షిఫ్ట్‌లను నిర్వహించుకోవడం వంటి ప్రయోజనాలు పొందుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న కార్మికుడి వేతనం, పని గంటలు, సెలవులు, భద్రత, సామాజిక భద్రత, ఉద్యోగ స్థిరత్వం వంటి అంశాలపై ఎవరి బాధ్యత ఎంత? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కార్మికుడి చేతిలో మిగిలేది ఎంత?**

హాస్పిటల్ ఒక ఏజెన్సీకి ఒక్కో ఉద్యోగికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని చెల్లిస్తే, ఆ మొత్తంలో నుంచి కార్మికుడికి వేతనం ఎంత అందుతోంది? చట్టబద్ధమైన ఏఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రయోజనాలు వర్తించే సందర్భాల్లో అవి సక్రమంగా అందుతున్నాయా? పని గంటలు, వారాంతపు సెలవులు, ఓవర్‌టైమ్, సెలవులు వంటి అంశాలు ఎలా అమలు అవుతున్నాయి? ఇవి కేవలం కార్మికుల ప్రశ్నలు మాత్రమే కాదు. ఆసుపత్రి యాజమాన్యం, కాంట్రాక్ట్ ఏజెన్సీలు, సంబంధిత కార్మిక శాఖ అధికారులు కూడా సమాధానం చెప్పాల్సిన అంశాలు.

**తనిఖీలెక్కడ ?**

కేంద్ర నమూనా నియమాలు, 2020 ప్రకారం ప్రవేశ స్థాయి భద్రతా గార్డులు , పర్యవేక్షకులకు నిర్దేశిత శిక్షణ ఉంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం సాధారణ గార్డులు/పర్యవేక్షకులకు కనీస శిక్షణ వ్యవధి 20 పని రోజులు. తరగతి బోధన 100 గంటలు, క్షేత్ర శిక్షణ 60 గంటలుగా పేర్కొనబడింది. మాజీ సైనికులు, మాజీ పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా తక్కువ వ్యవధి నిబంధన ఉంది. శిక్షణలో అత్యవసర పరిస్థితుల్లో స్పందన, ప్రథమ చికిత్స, అగ్ని ప్రమాదాల సమయంలో చర్యలు, గుంపుల నియంత్రణ, భద్రతా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. కనీస శిక్షణ లేకుండానే ధ్రువపత్రాలు జారీచేయడం.. కేవలం పత్రాల్లోనే కార్మికులను చూపించడం.. తప్పుడు రికార్డులతో నగరంలోని కొన్ని ప్రైవేట్ ఏజెన్సీలు ఇష్టారీతిన వ్యవహరిస్తుండటం గమనార్హం. సెక్యూరిటీ గార్డులను నియమించడం మాత్రమే సరిపోదని, వారిని పర్యవేక్షించే వ్యవస్థ ఉండాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధలకు పాతరేస్తూ... కార్మికుల పొట్టగొడుతూ.. నగరంలో ఇష్టారీతిన కొనసాగుతున్న పలు ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీల అక్రమ దందాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### చట్టం ఏం చెబుతోంది?

ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలను నియంత్రించడానికి చట్టాలు కఠినంగా ఉన్నా ఆచరణలో మాత్రం అమలుకావడంలేదు. నిబంధనల ప్రకారం ఏజెన్సీ పర్యవేక్షకులను నియమించాలి. పర్యవేక్షకుడిగా నియమించే వ్యక్తికి నిర్దేశిత అర్హతలు ఉండాలి. సైన్యం, నౌకాదళం, వాయుసేన, పోలీసు, సాయుధ బలగాలు, హోమ్ గార్డ్స్ వంటి విభాగాల్లో కనీసం మూడు సంవత్సరాల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలి. కార్మిక చట్టాలకు సంబంధించి భద్రతా సిబ్బందికి వయోపరిమితి ఉంది. సెక్షన్ 10 ప్రకారం ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా నియమించబడే వ్యక్తి భారత పౌరుడై ఉండాలి. 18 సంవత్సరాలు పూర్తై ఉండాలి. 65 సంవత్సరాల వయస్సు దాటకూడదు. వ్యక్తిత్వం, గత చరిత్రపై నిర్దేశిత పరిశీలన ఉండాలి. నిర్దేశిత భద్రతా శిక్షణ పూర్తి చేసి ఉండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలను పూర్తి చేయాలి. కొన్ని గత నేర నిర్ధారణలు లేదా నిర్దిష్ట కారణాలతో సేవ నుంచి తొలగించబడిన వ్యక్తుల విషయంలో కూడా చట్టం పరిమితులు విధిస్తుంది. అయితే.. ఈ నిబంధలను ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీలు పట్టించుకున్న పాపాన పోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి నేపథ్యం పరిశీలించకుండానే నియామకాలు జరుపుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కనీస శిక్షణ లేకుండానే విధుల్లోకి తీసుకుంటున్నారని. పత్రాల్లో ఒకరు... పనుల్లో మరొకరు కొనసాగుతున్నట్లుగా తెలుస్తోంది. సిబ్బంది వివరాలు, విధుల నిర్వహణ, శిక్షణ, రికార్డులు, వేతన చెల్లింపులు, క్లయింట్ సంస్థలతో ఒప్పందాలు, పర్యవేక్షణ వంటి అంశాలను మేనేజర్ లేదా సంస్థ నిర్వహణలో ఉన్న వ్యక్తి పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.



# ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు

- పార్టీ ఫిరాయింపుల కేసులో హైకోర్టు తీర్పు
- స్పీకర్ నిర్ణయంపై న్యాయస్థానం జోక్యం
- ఖాళీ కానున్న ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం



**అక్షరశక్తి, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసింది. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హుడిగా ప్రకటించింది. 2024లో దానం కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేశారు. కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయడాన్ని పరిగణలోకి తీసుకుని, హైకోర్టు స్పీకర్ తీర్పును కొట్టివేసింది. కాగా, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసేందుకు స్పీకర్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, అంతేకాకుండా కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేశారని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, వివేక్‌రెడ్డి హైకోర్టుకు తెలియజేస్తూ.. పార్టీ ఫిరాయింపులకు ఇంతకంటే వేరే ఆధారాలు అవసరం లేదని అతడిపై వేటు వేయాలని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకుంటామని, ఒక గంట సమయం ఇవ్వాలని ఆలోపు ఈ తీర్పు సస్పెండ్ చేయాలని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు దానం నాగేందర్ తరఫు న్యాయవాదుల కోరగా వారి అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. కాగా, సుప్రీంకోర్టుకు వెళ్లినా ఉపశమనం దొరికే అవకాశం లేదని, ఉప ఎన్నిక తప్పదని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు చెబుతున్నారు.

# మానసకు అండగా మెడికో పేరెంట్స్ అసోసియేషన్




**అక్షరశక్తి, హనుమకొండ:** నారాయణపేట జిల్లా జూజుపేటకు చెందిన మానస చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయింది. తల్లి అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ, సూపర్ మార్కెట్‌లో పనిచేస్తూ తన విద్యను కొనసాగించింది. పట్టుదలతో చదివి ఎంబీబీఎస్‌లో ప్రైవేట్ మెడికల్ కళాశాలలో క్యాట్-ఏ సీటు సాధించింది. అయితే సెప్టెంబర్ 19లోపు రూ.1.22 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉండగా, ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో సీటు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. తన పరిస్థితిని మెడికో పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణచారికి మానస వివరించింది. ఆమె పరిస్థితిని తెలుసుకున్న సత్యనారాయణచారి స్పందించి, మానస చదువుకు పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని మెడికో పేరెంట్స్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన మొత్తాన్ని సేకరించారు. అనంతరం శుక్రవారం మానసను కళాశాలకు తీసుకెళ్లి అసోసియేషన్ సభ్యులు డీడీల ద్వారా ఫీజు చెల్లించి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మానస చదువు పూర్తయ్యే వరకు కళాశాల ఫీజులను అసోసియేషన్‌నే చెల్లిస్తుందని, భవిష్యత్‌లో ఫీజు వివరాలను తమకే తెలియజేయాలని కళాశాల యాజమాన్యానికి తెలిపారు. మానస అడ్మిషన్ ప్రక్రియలో అసోసియేషన్ కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఉపాధ్యక్షులు పానుగల్ల సుజాత, కేవీఆర్, శ్రీనివాస్‌రావు, చిస్టీ, సంధ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అసోసియేషన్ సభ్యులు గార్డియన్లుగా ఉండి అడ్మిషన్ పూర్తి చేశారు. సహాయం అందించిన ప్రతి పేరెంట్‌కు సత్యనారాయణచారి కృతజ్ఞతలు తెలిపారు. హాస్టల్, ఇతర విద్యా ఖర్చుల కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. తన తల్లి అనారోగ్యంతో ఉండి, తనకు ఎవరూ తోడులేని సమయంలో మెడికో పేరెంట్స్ అమ్మానాన్నలా అండగా నిలిచారని మానస భావోద్వేగంతో పేర్కొంది. భవిష్యత్‌లో మంచి డాక్టర్‌గా మారి తనలాంటి వారికి సహాయం చేస్తానని తెలిపింది. మానసకు సహాయం చేయదలచిన వారు ఫోన్‌పే నంబర్ 6300257711కు తమ వంతు సహాయం అందించవచ్చు.

# పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు





- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించిన స్నేహ శబరీష్
- లీప్ కార్యక్రమం అమలుపై ఎంఈఓపై ఆగ్రహం
- పరిశుభ్రత, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ: కలెక్టర్

**అక్షరశక్తి, మహబూబాబాద్:** డోర్నకల్ మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్), కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన ఆమె.. వారి సబ్జెక్టుల పరిజ్ఞానం, చదవడం-రాయడం, అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో లీప్ కార్యక్రమం ద్వారా ఇంగ్లిష్ భాషా నైపుణ్యాల పెంపు కార్యక్రమాన్ని అమలు చేయకపోవడంపై సంబంధిత ఎంఈఓపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషపై పట్టు పెంచేందుకు 'యాక్టివ్ పార్టిసిపేషన్' విధానంలో బోధన సాగించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులను బోధనలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించి వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

**కేజీబీవీలోనూ పరిశీలన**

అనంతరం డోర్నకల్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి చదువు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాజరు శాతం, రికార్డులను పరిశీలించారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినుల ఉన్నత విద్యా లక్ష్యాలను తెలుసుకుని వారిని ప్రోత్సహించారు. పాఠశాలల పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీ విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. తనిఖీలో ఇన్‌చార్జి డీఈఓ ఎం. శ్రీరాములు, జీఈసీఓ గాయత్రి, ఎంఈఓ అంగోత్ లక్ష్మా, కేజీబీవీ ప్రత్యేక అధికారి షేక్ మున్ని, డోర్నకల్ ఎంఆర్ఓ రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎస్సీ విభాగం ప్రచార కార్యదర్శిగా జన్ను నర్సయ్య

**అక్షరశక్తి, వరంగల్:** వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంటల్ ప్రచార కార్యదర్శిగా జన్ను నర్సయ్య నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంటల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎస్సీ కుటుంబాలకు చేరేలా ప్రచారం చేస్తానన్నారు. దళితులకు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకోవడం గౌరవంగా ఉందన్నారు. సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి కొమురారెడ్డి, 15వ డివిజన్ అధ్యక్షుడు కందుల అశోక్, ఎలగొండ ప్రవీణ్, ల్యాదల్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## తగ్గించిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి



**అక్షరశక్తి, నర్సంపేట:** ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తగ్గించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని జనసేన నియోజకవర్గ నాయకుడు మేరుగు శివకోటి యాదవ్ కోరారు. ఈ మేరకు నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సరస్వతిని కలిసి వినతిపత్రం అందజేశారు. నర్సంపేట నుంచి నిజామాబాద్‌కు నడిచే 15 నుంచి 17 బస్సు సర్వీసులతో పాటు శ్రీశైలం, భద్రాచలం, ఆదిలాబాద్ తదితర మార్గాల్లోనూ సర్వీసులు తగ్గించారని తెలిపారు. పదవీ విరమణలు, బదిలీల కారణంగా డిపోలో సిబ్బంది కొరత ఏర్పడిందని, దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని మార్గాల్లో కొన్ని నెలల క్రితం బస్సు సర్వీసులను తగ్గించిన విషయం వాస్తవమేనని, ప్రత్యామ్నాయంగా నర్సంపేట నుంచి వరంగల్ మీదుగా మరికొన్ని సర్వీసులను పెంచామని డిపో మేనేజర్ వివరించినట్లు శివకోటి యాదవ్ తెలిపారు. సిబ్బంది కొరత లేకుండా కొత్త సిబ్బందిని తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారని పేర్కొన్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## డ్రైనేజీ పనులతో ప్రజలకు ఇబ్బందులా?

**అక్షరశక్తి, నర్సంపేట:** పట్టణ బస్టాండ్ ఆవరణలో ప్రధాన రహదారిపై చేపడుతున్న డ్రైనేజీ పనుల తీరుపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్రైనేజీ కాలువల్లోని మురుగును తొలగించే పనులు పూర్తిస్థాయిలో చేపట్టకుండా రోడ్లపై మురుగు, మట్టి పేరుకుపోయేలా చేస్తున్నారని ఆరోపించారు. సుమారు రూ.10 లక్షల టెండర్‌తో చేపడుతున్న పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు అడుగుల లోతున్న కాలువలను పూర్తిగా శుభ్రం చేయకుండా పైపైగా పనులు చేయడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోందని పేర్కొన్నారు. వినాయక నవరాత్రుల నేపథ్యంలో ప్రధాన రహదారిపై మురుగు, మట్టి పేరుకుపోవడంతో ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్ పరిసరాలను సందర్శించిన కౌన్సిలర్లు పనులను పరిశీలించి అధికారులను ప్రశ్నించారు. పనులను త్వరగా పూర్తి చేసి రహదారిని శుభ్రం చేయాలని కోరారు. బానోత్ నవీన్ నాయక్, శివరాత్రి స్వామి, మండల శ్రీదేవి శ్రీనివాస్, కీర్తి దుష్యంత్‌రెడ్డి, దోమటి రమ్య సంతోష్, బుస శిరీష రాజు తదితరులు పాల్గొన్నారు.



## పీఆర్సీ ప్రకటించి.. సీపీఎస్ రద్దు చేయాలి



**అక్షరశక్తి, గూడూరు:** పీఆర్సీని వెంటనే ప్రకటించి సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ డిమాండ్ చేశారు. గూడూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పలు పాఠశాలలను సందర్శించారు. గురుకుల ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసి అర్హులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు కొత్త పోస్టులు మంజూరు చేయడంతో పాటు సీఆర్టీలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోన్నతులు కల్పించినప్పటికీ ఐటీడీఏ పాఠశాలల్లో అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. గిరిజన పాఠశాలలకు పర్యవేక్షణ అధికారులను నియమించాలని కోరారు. పీఆర్సీ నివేదిక తెప్పించి వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న ఉద్యోగ, ఉపాధ్యాయుల జేఏసీతో జరిగే చర్చల్లో సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దబ్బగట్ల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బత్తుల శ్రీనివాస్, మండల కార్యదర్శి సదరం దేవేందర్, జి.సమ్మయ్య, కోటిలింగం, వనజ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## హ్యామ్ రోడ్ల పనులు వెంటనే ప్రారంభించాలి



**అక్షరశక్తి, హైదరాబాద్, సెప్టెంబరు 18:** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల పనులను ఈ వర్కింగ్ సీజన్‌లోనే ప్రారంభించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కోరారు. శాసనసభలో శుక్రవారం జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో వేల కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి హ్యామ్ విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయి, అవసరమైన అనుమతులు వచ్చినా కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు పూర్తి కాక పనులు ప్రారంభం కాలేదన్నారు. అక్టోబరులో వర్కింగ్ సీజన్ ప్రారంభం కానున్నందున దసరాలోపు అగ్రిమెంట్లు పూర్తి చేసి పనులు చేపట్టాలని కోరారు. పనులు ప్రారంభమైన తర్వాత బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా నిధులు సమకూర్చాలని సూచించారు.

**15 రోజుల్లో పనులు ప్రారంభిస్తాం**

కడియం శ్రీహరి ప్రశ్నకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమాధానమిస్తూ హ్యామ్ ప్రాజెక్టులో చాలావరకు అగ్రిమెంట్లు పూర్తయ్యాయని, వచ్చే 15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నిధుల సమీకరణపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షిస్తున్నారని, ఆర్‌బీఐ, హడ్కో నుంచి రుణ అనుమతులు లభించాయని చెప్పారు.

## ఎంబీబీఎస్ విద్యార్థినికి ఆర్థిక సాయం

**అక్షరశక్తి, వర్ధన్నపేట:** పేద దళిత కుటుంబానికి చెందిన కొండేటి అకిరా నీట్‌లో ప్రతిభ కనబరిచి పటాన్‌చెరువులోని మహేశ్వర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఫీజు చెల్లించేందుకు రూ.2 లక్షలు అవసరం కాగా, ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం సాయం కోసం ఎదురుచూస్తోంది. ఈ విషయంపై వచ్చిన సోషల్ మీడియా కథనానికి స్పందించిన ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ చొరవతో వాసవి క్లబ్ కేసీజీఎఫ్ డాక్టర్స్, వరంగల్ అధ్యక్షుడు డా. శివ్వా సృజన్, కార్యదర్శి డా. ఆశా దీప్తి, కోశాధికారి డా. అంచూరి కార్తీక్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ నరేష్ కుమార్ వేములపల్లి రూ.5 వేల సాయం చేశారు. దాతలకు విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాలపై కలెక్టర్ ఫోకస్

- విద్యార్థుల ప్రవేశాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ..
- బోధనలో వినూత్న పద్ధతులు అవలంబించాలని ఆదేశం



**అక్షరశక్తి, జనగామ:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచడంతో పాటు విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని, ప్రతి విద్యార్థి విద్యా పురోగతిపై అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఇంటర్మీడియట్ విద్యపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, విద్యా ప్రమాణాలు, కొనసాగుతున్న కోర్సులు, వృత్తి విద్యా కోర్సులు, విద్యార్థుల మధ్యలో చదువు మానివేత తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.

**901 మంది విద్యార్థుల చేరిక**

2026-27 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటివరకు 901 మంది విద్యార్థులు చేరినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి జితేందర్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో విద్యార్థుల నమోదు, ప్రస్తుతం కళాశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, చదువు మధ్యలో నిలిపివేసిన విద్యార్థుల వివరాలను సమీక్షించారు. జిల్లాలో ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 12 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ రంగంలో మొత్తం 38 కళాశాలలు ఉండగా, వాటిలో 12 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తొమ్మిది మహాత్మా జ్యోతిబా పూలే విద్యాసంస్థలు, ఎనిమిది ఆదర్శ కళాశాలలు, ఐదు సాంఘిక సంక్షేమ కళాశాలలు, రెండు మైనారిటీ కళాశాలలు, ఒక గిరిజన సంక్షేమ కళాశాల, ఒక నివాస కళాశాల ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరును ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానం ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హాజరు విషయంలో నిర్లక్ష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**గణితంపై ఆసక్తి పెంచాలి**

విద్యార్థుల్లో గణితంపై ఉన్న భయాన్ని తొలగించి, ఆ సబ్జెక్టుపై ఆసక్తి పెంపొందించేలా బోధన సాగించాలని కలెక్టర్ సూచించారు. రోజువారీ జీవితానికి అన్వయించే ఉదాహరణలను ఉపయోగిస్తూ సులభమైన పద్ధతుల్లో పాఠ్యాంశాలను వివరించాలని అధ్యాపకులకు సూచించారు. బోధన కేవలం పాఠ్యపుస్తకాలకు పరిమితం కాకుండా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఆసక్తిని పెంచేలా ఉండాలని అన్నారు. విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేసేలా వారికి అవసరమైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి జితేందర్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల ఆశయాలను కొనసాగిద్దాం




**అక్షరశక్తి, పాలకుర్తి, సెప్టెంబరు 18:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని ఎంఎల్‌పీఐ రెడ్‌ఫ్లాగ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. సెప్టెంబరు 17ను పురస్కరించుకుని పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. జనగామ జిల్లా కార్యదర్శి మాన్యపు భుజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. కాసిం, రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధమల్ల భాస్కర్ పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన ప్రచార పత్రాన్ని ఆవిష్కరించారు. భూమి, భుక్తి, వెట్టి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని కాసిం, భాస్కర్ పేర్కొన్నారు. ఆ పోరాటంలో జనగామ జిల్లా కీలక పాత్ర పోషించిందన్నారు. సాయుధ పోరాటానికి భాజపాకు సంబంధం లేదని, దాన్ని హిందూ-ముస్లింల పోరాటంగా చిత్రీకరించడం సరికాదని విమర్శించారు. కార్యక్రమంలో పైండ్ల యాకన్న, మిట్ట అంజన్న, ఎం.డి. అబ్బాస్, రేండ్ల ఉమ, దుంపల లక్ష్మి, ఎం.డి. నబీన్‌సాబ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్ల నిరవధిక సమ్మెపై డీఎంకు వినతి



**అక్షరశక్తి, ములుగు:** తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకత్వం పిలుపుమేరకు ములుగు జిల్లాలోని రైస్ మిల్లర్లు చేపట్టిన నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో సమ్మె విషయాన్ని తెలియజేస్తూ జిల్లా ఇండస్ట్రీస్ డీఎం సిద్ధార్థ రెడ్డికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం రిప్రజెంటేషన్ అందజేశారు. జిల్లాలోని రైస్ మిల్లులు గత తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్నట్లు డీఎంకు వివరించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, కార్యదర్శి సహోదరి రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఉపాధ్యక్షులు అక్కల రఘోత్తం, పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



GUEST COLUMN

# దివ్యాంగుల పట్ల దయ అవసరం లేదు

## హక్కుల పరిరక్షించే బాధ్యత ప్రభుత్వాలదే


- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

దివ్యాంగులను జాలితో చూడటం కాదు, సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవితం కల్పించడమే నిజమైన సంక్షేమం. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సుమారు 130 కోట్ల మంది, అంటే ప్రతి ఆరుగురిలో ఒకరు, గణనీయమైన దివ్యాంగతతో జీవిస్తున్నారు. దివ్యాంగతను కేవలం వ్యక్తిగత వైకల్యంగా కాకుండా, అందుబాటులో లేని భవనాలు, రవాణా, సమాచార వ్యవస్థలు, విద్యా-ఉపాధి అవకాశాలు, సామాజిక వివక్ష వంటి అడ్డంకులతో కలిసిన సామాజిక సమస్యగా చూడాలని అంతర్జాతీయ విధానాలు స్పష్టం చేస్తున్నాయి.

భారతదేశంలో జనాభా లెక్కలు 2011 ప్రకారం 2.68 కోట్ల మంది దివ్యాంగులుగా నమోదయ్యారు. ఇది మొత్తం జనాభాలో 2.21 శాతం. 2018లో జరిగిన జాతీయ నమూనా సర్వేలో దివ్యాంగుల శాతం 2.2గా నమోదైంది. అయితే ఈ సంఖ్యలను ప్రపంచ గణాంకాలతో నేరుగా పోల్చేటప్పుడు నిర్వచనాలు, సర్వే విధానాల్లో తేడాలను పరిగణనలోకి తీసుకోవాలి. అదే సర్వేలో 7 సంవత్సరాలు పైబడిన దివ్యాంగుల్లో అక్షరాస్యత 52.2 శాతం మాత్రమే; 15 సంవత్సరాలు పైబడిన వారిలో మాధ్యమిక విద్య లేదా అంతకంటే పై స్థాయి విద్య పొందినవారు 19.3 శాతం. అంతకంటే ఆందోళనకరమైన విషయం ఏమిటంటే 15 సంవత్సరాలు పైబడిన దివ్యాంగుల శ్రమశక్తి భాగస్వామ్య రేటు 23.8 శాతం, ఉద్యోగాల్లో ఉన్నవారి నిష్పత్తి 22.8 శాతమే. ప్రభుత్వ సహాయం అందుకున్నట్లు తెలిపిన వారు 21.8 శాతం మాత్రమే.

అంటే సమస్య చట్టాల కొరత మాత్రమే కాదు; చట్టం కాగితంపై ఉండటం, హక్కు జీవితంలో అందుబాటులోకి రావడం మధ్య ఉన్న అంతరం. భారతదేశం ఇప్పటికే దివ్యాంగుల హక్కుల చట్టం, 2016ను అమలు చేస్తోంది. ఈ చట్టం బెంచ్‌మార్క్ దివ్యాంగత కలిగిన పిల్లలకు 6 నుంచి 18 సంవత్సరాల వరకు ఉచిత విద్య హక్కును, ప్రభుత్వ మరియు ప్రభుత్వ సహాయం పొందే ఉన్నత విద్యా సంస్థల్లో కనీసం 5 శాతం సీట్ల రిజర్వేషన్‌ను, ప్రభుత్వ ఉద్యోగాల్లో కనీసం 4 శాతం ఖాళీల రిజర్వేషన్‌ను నిర్దేశించింది.

అయితే రిజర్వేషన్ ప్రకటించడం కంటే దాని అమలును పర్యవేక్షించడం ముఖ్యం. ప్రతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలో దివ్యాంగుల రిజర్వేషన్ రోస్టర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఖాళీలను గుర్తించడంలో ఆలస్యం, పోస్టులను అనర్హమైనవిగా చూపించడం, నియామక ప్రక్రియలో సహేతుకమైన సౌకర్యాలు కల్పించకపోవడం వంటి సమస్యలకు ప్రత్యేక ఫిర్యాదు, అప్పీల్ వ్యవస్థ ఉండాలి. ఉద్యోగాల్లో ప్రవేశమే కాకుండా పదోన్నతులు, శిక్షణ, కార్యాలయ సౌకర్యాలు, పని సమయాల్లో అవసరమైన మార్పులు, సహాయక సాంకేతిక పరికరాలు కూడా విధానంలో భాగం కావాలి.

ఇదే సమయంలో విద్యను ప్రత్యేక పాఠశాలలకే పరిమితం చేయకుండా సమగ్ర విద్యగా మార్చాలి. పాఠశాలల్లో ర్యాంపులు, లిఫ్టులు, అందుబాటులో ఉండే మరుగుదొడ్లు మాత్రమే కాకుండా బ్రెయిలీ పాఠ్యపుస్తకాలు, సంకేత భాషా నిపుణులు, స్క్రీన్ రీడర్లు, సహాయక సాంకేతిక పరికరాలు, ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అవసరం. 2018 సర్వేలో దివ్యాంగ పిల్లల్లో సాధారణ పాఠశాలలో ఎప్పుడైనా చేరిన వారి శాతం 62.9 మాత్రమే ఉండటం విద్యా వ్యవస్థలో ఇంకా ఎంత దూరం ప్రయాణించాల్సి ఉందో చెబుతోంది.


డాక్టర్ బరిగల శివ,
జైబీమ్ సంస్థల ఫౌండర్ మరియు ఎడిటర్


ప్రొఫెసర్. పెదమళ్ళ శ్రీనివాసరావు

భారత ప్రభుత్వం 2015లో ప్రారంభించిన సుగమ్య భారత్ అభియాన్ భవనాలు, ప్రజా రవాణా, సమాచార-సాంకేతిక వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు బ్యాంకింగ్, ఉన్నత విద్య, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, ఆరోగ్య సంస్థలు, పోలీస్ స్టేషన్లు, ఐసీటీ వంటి రంగాలకు కూడా ప్రత్యేక ప్రాప్యత ప్రమాణాలు రూపొందించబడ్డాయి. 2026 ఆగస్టులో అడ్డంకులేని వాతావరణం కోసం కొత్త మార్గదర్శకాలు కూడా విడుదలయ్యాయి.

కానీ ప్రతి కొత్త ప్రభుత్వ భవనం నిర్మాణానికి ముందు యాక్సెసిబిలిటీ ఆడిట్ తప్పనిసరి చేయాలి. పాత భవనాలను దశలవారీగా మార్చాలి. బస్సులు, రైల్వే స్టేషన్లు, ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, కోర్టులు, పోలీస్ స్టేషన్లు దివ్యాంగులకు వాస్తవంగా ఉపయోగపడుతున్నాయా లేదా అన్నది స్వతంత్ర సంస్థలతో తనిఖీ చేయాలి. వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు, ప్రభుత్వ దరఖాస్తులు కూడా స్క్రీన్ రీడర్లు, బ్రెయిలీ, సంకేత భాష, సులభంగా అర్థమయ్యే సమాచారానికి అనుకూలంగా ఉండాలి. ఐక్యరాజ్యసమితి దివ్యాంగుల హక్కుల ఒప్పందంలోని 9వ అధికరణం భౌతిక వాతావరణంతో పాటు రవాణా, సమాచార-సాంకేతిక వ్యవస్థలు, ప్రజా సేవలన్నింటినీ అందుబాటులోకి తేవాలని స్పష్టం చేస్తోంది.

న్యాయవ్యవస్థలో ప్రాప్యత మరింత కీలకం. దివ్యాంగుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం, ఫిర్యాదు ఇవ్వడం, న్యాయవాదిని కలవడం, కోర్టు పత్రాలను చదవడం, వాంగ్మూలం ఇవ్వడం, తీర్పును అర్థం చేసుకోవడం, ప్రతి దశలోనూ సహాయక వ్యవస్థ ఉండాలి.

ప్రతి జిల్లాలో దివ్యాంగుల కోసం ప్రత్యేక న్యాయ సహాయ కేంద్రాలను బలోపేతం చేయాలి. పోలీసులకు, న్యాయమూర్తులకు, ప్రభుత్వ న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, న్యాయసేవా సంస్థలకు దివ్యాంగుల హక్కులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. ఐక్యరాజ్యసమితి కూడా న్యాయ ప్రక్రియలో భౌతిక ప్రాప్యత, ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్, శిక్షణ పొందిన సహాయకులు, న్యాయ సహాయం వంటి అంశాలను అవసరమైనవిగా గుర్తిస్తోంది.

విదేశాల్లోనూ ఉపయోగకరమైన నమూనాలు ఉన్నాయి. అమెరికాలోని అమెరికన్స్ విత్ డిజెబిలిటీస్ యాక్ట్ ఉద్యోగం, ప్రభుత్వ సేవలు, ప్రజా ప్రదేశాలు, రవాణా, కమ్యూనికేషన్ వంటి రంగాల్లో వివక్షను నిషేధిస్తూ సహేతుకమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను నిర్దేశిస్తుంది. బ్రిటన్‌లోని ఈక్వాలిటీ యాక్ట్, 2010 ప్రకారం సేవలందించే సంస్థలు దివ్యాంగులకు కలిగే అడ్డంకులను ముందుగానే గుర్తించి 'రీజనబుల్ అడ్జస్ట్‌మెంట్స్' చేయాలి; అవసరమైన సందర్భాల్లో భౌతిక మార్పులు, సహాయక పరికరాలు, ప్రత్యామ్నాయ సమాచార విధానాలు కల్పించాలి. ఇవి భారతదేశంలో కూడా అమలు పర్యవేక్షణను మరింత బలపరచడానికి ఉపయోగపడే అనుభవాలు.

కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేక డిజెబిలిటీ బడ్జెట్ రూపొందించి, ప్రతి పథకానికి కేటాయించిన నిధులు ఎంత, ఖర్చు ఎంత, లబ్ధిదారులు ఎంతమంది అన్నది జిల్లా స్థాయిలో ప్రజలకు తెలియజేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి జిల్లాలో పునరావాస కేంద్రాలు, సహాయక పరికరాల పంపిణీ కేంద్రాలు, వృత్తి శిక్షణ కేంద్రాలు, మానసిక-సామాజిక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. యూడీఐడీ వ్యవస్థ ద్వారా డేటాను సమగ్రపరచి, గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎవరు ఏ పథకం పొందుతున్నారో తెలుసుకునేలా చేయాలి. 2026-27 నుంచి 2030-31 వరకు యూడీఐడీ వ్యవస్థకు కేంద్రం ప్రత్యేక ఆర్థిక సహాయ పథకాన్ని కొనసాగిస్తోంది.

దివ్యాంగుల సంక్షేమాన్ని కేవలం పింఛన్లు, పరికరాలు, సబ్సిడీలకు పరిమితం చేయడం కూడా సరైంది కాదు. రాజకీయాల్లో, స్థానిక సంస్థల్లో, ప్రజా విధానాల రూపకల్పనలో దివ్యాంగుల భాగస్వామ్యాన్ని పెంచాలి. ఐక్యరాజ్యసమితి ఒప్పందంలోని 29వ అధికరణం వారికి ఓటు హక్కుతో పాటు ఎన్నికల్లో పోటీ చేయడం, ప్రజా పదవులు చేపట్టడం, రాజకీయ-ప్రజా జీవితంలో సమానంగా పాల్గొనే హక్కును గుర్తిస్తోంది.

ఈ విస్తృత సమస్యలపై నిరంతరం గొంతెత్తుతున్న డాక్టర్ బరిగెల శివ, కాకతీయ విశ్వవిద్యాలయం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు వంటి వ్యక్తులు గత మూడు దశాబ్దాలకు పైబడిన వారి కృషి ప్రత్యేకంగా ప్రశంసించదగినది. ముఖ్యంగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు స్వయంగా 100 శాతం ఆర్థోపెడిక్ దివ్యాంగత కలిగిన వ్యక్తిగా, దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాలపై పరిశోధన చేసినవారిగా, 2002 నుంచే దివ్యాంగుల సమస్యలపై నిరంతరంగా రచనలు చేస్తున్నవక్తిగా కాకతీయ విశ్వవిద్యాలయ అధికారిక ప్రొఫైల్‌లో వివరాలు ఉన్నాయి. దివ్యాంగుల సంక్షేమ పరిపాలనపై ఆయన పీహెచ్‌డీ పరిశోధన చేయడమే కాకుండా, దివ్యాంగుల సంక్షేమం, విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాలు, రాజకీయ భాగస్వామ్యం, హక్కుల అమలు వంటి అంశాలపై పుస్తకాలు, పరిశోధనా వ్యాసాలు, సంపాదకీయాలు రాశారు.

అందువల్ల డాక్టర్ బరిగెల శివ, జైబీమ్ సంస్థల ఫౌండర్ , ఎడిటర్ ప్రస్తావించిన దివ్యాంగులకు చట్టపరమైన అవగాహన, న్యాయ ప్రాప్యత, రిజర్వేషన్ల అమలు, రాజకీయ అవకాశాలు, వేధింపులపై కఠిన చర్యలు వంటి అంశాలు కేవలం డిమాండ్లుగా కాకుండా ప్రభుత్వ పరిపాలనలో కొలిచే లక్ష్యాలుగా మారాలి. దివ్యాంగుల కోసం విధానం రూపొందించే ప్రతి కమిటీలో దివ్యాంగుల ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలి. వారి గురించి నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారిని పక్కన పెట్టి తీసుకునే నిర్ణయం ఎంత మంచి ఉద్దేశంతో ఉన్నా అసంపూర్ణమే. ఐక్యరాజ్యసమితి కూడా దివ్యాంగులను ప్రభావితం చేసే విధానాల రూపకల్పన, అమలులో వారి ప్రతినిధి సంస్థలను సంప్రదించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది.

చివరికి దివ్యాంగుల సంక్షేమానికి కొలమానం వారు ఎన్ని పథకాలు పొందారన్నది కాదు; వారు ఎన్ని అడ్డంకులను దాటి స్వతంత్రంగా జీవించగలుగుతున్నారు, చదువుకోగలుగుతున్నారు, ఉద్యోగం పొందగలుగుతున్నారు, న్యాయం పొందగలుగుతున్నారు, ప్రజా జీవితంలో భాగస్వాములు కాగలుగుతున్నారు అన్నదే ప్రధానాంశం. దయను దాటి హక్కుల దిశగా, సంక్షేమాన్ని దాటి సాధికారత దిశగా, ప్రత్యేక సదుపాయాలను దాటి సమగ్ర సమాజం దిశగా భారతదేశం అడుగులు వేయాల్సిన సమయం ఇది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.